ప్రజాశక్తి
గురువారం 25 సెప్టెంబర్ 2025
5
అల్లూరి సీతారామరాజు

బురద గెడ్డ వంతెన మరమ్మతుకు నిధులు

ప్రజాశక్తి-అరకులోయ: మండలంలోని యండపల్లివలస - అరకు సంతబయలు మార్గమధ్యలో ప్రమాదభరితంగా మారిన బురద గెడ్డ వంతెన మరమ్మతులకు రూ.10 లక్షల ఉపాధి హామీ నిధులు మంజూరైనట్లు అరకులోయ ఎంపిడిఒ లవరాజు తెలిపారు. ప్రమాదకరంగా మారిన ఈ బ్రిడ్జి ఒకవైపు కోతకు గురై ఎప్పుడు కూలిపోతుందో తెలియక వాహన చోదకులు బిక్కు బిక్కు మంటూ రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో ఈ బ్రిడ్జిని వెంటనే మరమ్మతులు చేయాలని విజయనగరం జోన్ ఆర్టిసి చైర్మన్ సియ్యారి దొన్ను దొర ఇటీవల అరకులోయకు సందర్శించిన జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణమే నిధులు మంజూరుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారన్నారు. ఈ మేరకు రూ. 10 లక్షలు కేటాయించారని ఎంపిడిఒ తెలిపారు. బుధవారం పాడేరు ఆర్అండ్‌బి ఇఇ బురద గెడ్డ బ్రిడ్జివద్దకు చేరుకుని ప్రస్తుత పరిస్థితిని పరిశీలించినట్లు తెలిపారు. కాగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు తగ్గు ముఖం పట్టగానే బ్రిడ్జి మరమ్మతులు చేపట్టనున్నట్లు ఎంపిడిఒ తెలిపారు.

నిధులు విడుదలలో నిర్లక్ష్యం

- నత్తనడకన పాడేరు వైద్యకళాశాల నిర్మాణం
- లక్ష్యానికి దూరంగా వైద్యవిద్య, సేవలు
- మిగులు నిధులు తక్షణమే విడుదల చేయాలి
- ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వద్దు
- సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స
- ఆదివాసీ అరణ్య గర్జన బృందం సందర్శన

ప్రజాశక్తి -పాడేరు: జిల్లా కేంద్రం పాడేరులో నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలకు కేటాయించిన నిధులు విడుదలతో జాప్యంతో నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయని, వెంటనే మిగులు నిధులను మంజూరుచేసి నిర్మాణాలను వేగవంతం చేసి పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి అప్పల నర్స కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైడ్రో పవర్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా మన్యంలో సిపిఎం ఆధ్వర్యంలో చేపడుతున్న ఆదివాసీ అరణ్య గర్జన జీపు యాత్ర బుధవారం ఉదయం మినుములూరు, గుర్రగరువులో పర్యటన పూర్తి చేసిన తర్వాత పాడేరు చేరుకున్న సందర్భంగా, ఇక్కడి ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించారు. అక్కడి దయనీయ పరిస్థితులను పరిశీలించారు.

ఈ సందర్భంగా అప్పలనర్స మాట్లాడుతూ పాడేరు వైద్య కళాశాల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 500 కోట్లు మంజూరు చేయగా, ఇప్పటివరకు కేవలం రూ. 170 కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. మిగిలిన రూ. 330 కోట్ల నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదలలో జాప్యంలో ప్రభుత్వ కాలేజీ నిర్మాణం, సౌకర్యాల కల్పన పనులు నత్త నడకన సాగుతున్నాయని విమర్శించారు ఫలితంగా రోజువారీ అవుట్‌పేషెంట్ సంఖ్య పెరగక, వైద్య సేవలు అందించడంలో తీవ్ర లోపాలు ఏర్పడ్డాయన్నారు. అంతేకాకుండా పాడేరు వైద్యకళాశాలలో ముందు ప్రకటించిన విధంగా 150 ఎంబిబిఎస్ సీట్లను భర్తీ చేయకుండా కేవలం 50 సీట్లకు కుదించారన్నారు. ఇందులోనూ స్థానిక ఆదివాసీ విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం దురదష్టకరమన్నారు. కేవలం ఇద్దరు ఎస్‌టి విద్యార్థులు మాత్రమే ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారన్నారు.స్థానిక ఆదివాసీల ఆకాంక్షలకు అనుగుణంగా, వైద్య విద్యను అందుబాటులోకి తీసుకురావడం, మెరుగైన వైద్య సేవలు అందించడం కోసం పాడేరులో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేశారని, వారి ఆందోళన ఫలించి ప్రభుత్వం వైద్యకళాశాల మంజూరుచేసినా, ఇపుడు నిధులు విడుదలలో జాప్యంతో నిర్మాణం, వైద్యవిద్య సీట్ల భర్తీ పూర్తిస్థాయిలో జరగకపోవడం శోచనీయమన్నారు

ఇదిలా ఉంటే పిపిపి విధానంలో అభివృద్ధి పేరిట ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుకు కట్టబెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇప్పటికే గిరిజన ప్రాంతాల్లో వైద్యం అందని ద్రాక్షగా మారిందన్నారు. రేడియాలజిస్ట్, ఎమర్జెన్సీ విభాగాలకు సిబ్బంది నియమించకపోవడం, వసతి సౌకర్యాలు లేకపోవడంతో వైద్యులు, సిబ్బంది ఇక్కడ విధులు నిర్వహించడానికి సుముఖత చూపడం లేదన్నారు. ఈ నేపథ్యంలో, పాడేరు వైద్య కళాశాల నిర్మాణాన్ని వేగవంతం చేయడానికి బకాయి నిధులు విడుదల చేయాలని, ప్రైవేటీకరణ ప్రతిపాదనలను రద్దు చేయాలని, స్థానిక ఆదివాసీ విద్యార్థులకు ప్రాధాన్యత ఇస్తూ వైద్య విద్య, సేవలను మెరుగుపరచాలని కోరారు. పర్యటనలో యాత్ర బృందం నాయకులు కొర్ర త్రినాథ్, ఎస్. ధర్మన్న పడాల్, వరహాలు, సింహాద్రి, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వి. దాస్, ఎస్. హైమవతి, జిల్లా నాయకులు తాపుల కృష్ణారావు, బొజ్జన్న, చిన్నారావు పాల్గొన్నారు.

పాడేరు ప్రభుత్వ వైద్యకళాశాల భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న సిపిఎం బృందం

ప్రిన్సిపల్‌తో మాట్లాడుతున్న అప్పలనర్స తదితరులు

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి పల్లపు వెంకట్

హాస్టల్ అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలపై 29న ఆందోళన

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్

ప్రజాశక్తి -చింతూరు : గిరిజన పాఠశాల, కళాశాలలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 29న రంపచోడవరం ఐటిడిఎ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ తెలిపారు. బుధవారం చింతూరులో హాస్టల్ అవుట్‌సోర్సింగ్ వర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 5 ఏళ్లుగా శ్రమకు తగిన వేతనాలు ఇవ్వడం లేదని, గిరిజన హాస్టల్ వర్కర్ల జీవితాలు దుర్భరంగా ఉన్నాయని, 12 నుండి 14 గంటలు పని చేయించుకుంటూ అతి తక్కువ వేతనాలు ఇస్తున్నారని, చనిపోయిన వర్కర్ల స్థానంలో కొత్తవారి నియామకం చేపట్టడం లేదన్నారు. వారంలో ఒక సెలవు ఇవ్వాల్సి ఉండగా అది కూడా ఇచ్చే పరిస్థితి లేదని సమస్యల పరిష్కారానికి ఆందోళన నిర్వహిస్తున్నా మన్నారు. సమావేశంలో హాస్టల్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: రాజవొమ్మంగి పంచాయితీ విద్యానగర్ అప్పలరాజుపేట వెళ్లే మార్గంలో వీధి కుళాయిలు లేవు. పలువురు సర్పంచ్ గొల్లపూడి రమణి, ఎపిఐఐసి డైరెక్టర్ పెద్దిరాజు దృష్టికి తీసుకువెళ్లారు. వారు స్పందించి బుధవారం మోటార్ బిగించి, పైప్‌లైన్, కుళాయిలు సైతం ఏర్పాటు చేశారు. తాగునీటి సమస్యను పరిష్కరించడంతో గ్రామస్తులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి సంధ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐటిడిఎ ముందు ఆందోళన చేస్తున్న ఎర్రంపేట మహిళలు

'వెలుగు' అవినీతిపై విచారణ చేయండి

ప్రజాశక్తి -చింతూరు : 2018లో క్రాంతిసేన వివో, కావేరి వివోలో అధికారుల చేతివాటంతో వెలుగులో రూ.35 లక్షల అవినీతి జరిగిందని దాని వల్ల ఈ రెండు గ్రూపుల్లో ఉన్న 200 మంది మహిళలు నష్టపోయారని తక్షణమే అధికారులు మీద చర్యలు తీసుకుని అవినీతికి పాల్పడిన సొమ్మును రికవరీ చేసి, తమకు న్యాయం చేయాలని ఎర్రంపేట గ్రామమహిళలు ఐటిడిఎ మందు బుధవారం ఆందోళన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కన్నారావు, సిఐటియు నాయకులు వెంకట్, గిరిజన సంఘం నాయకులు సురేష్ మహిళలకు మద్దతుగా నిలబడి అధికారులపై చర్యలు తీసుకోవాలని నినదించారు. అధికారులు చేసిన తప్పుకి తమకు కొత్తలోన్లు ఇవ్వడానికి కూడా ప్రస్తుతం ఉన్న అధికారులు చొరవ చూపడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆడిట్ కమిటీ వేసి ఆడిట్ చేసి అవినీతి జరిగిన మాట వాస్తవం అని తేల్చారని కానీ ఏడు సంవత్సరాలు కావస్తున్నా సొమ్ము రికవరీ చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. అనంతరం పిఒకు వినతిపత్రం అందించారు. పిఒ సానుకూలంగా స్పందిస్తూ నెలరోజుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఐటిడిఎ పిఒ శుభంనొక్వాల్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతి

ప్రజాశక్తి-వి.ఆర్.పురం: సున్నవారిగూడెం, వెంకన్నగూడెం, రామవరం, చొప్పల్లి గ్రామస్తులు తాగునీటి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారని సత్వరమే పెద్దమట్టపల్లి నుండి సున్నంవారిగూడెం మీదుగా చొప్పల్లి వరకూ త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం అందించాలని చింతూరు ఐటిడిఎ పిఒ శుభం నొక్వాల్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. సున్నంవారిగూడెం ఆశ్రమ పాఠశాల విద్యార్థులు, సోములగూడెం ఆశ్రమ పాఠశాల విద్యార్థులు కూడా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విఆర్‌పురం ఎంపిపి కారం లక్ష్మి, ఎంపిటిసి పూనెం ప్రదీప్‌కుమార్, సర్పంచ్ పులి సంతోష్‌కుమార్, కారం సుందరయ్య, పోడియం శ్రీరామమూర్తి, సోడి మల్లయ్య, కుంజా కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ప్రభుత్వ భవన నిర్మాణాలు

- వచ్చేనెల 15లోగా పూర్తిచేసి అప్పగించాలి
- పాడేరు ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీపూజ

భవనాలను పరిశీలిస్తున్న పిఒ తిరుమణి శ్రీపూజ

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలో పూర్తయిన పలు ప్రభుత్వ భవనాలను వచ్చేనెల 15 నాటికి అప్పగించాలని ఇంజనీరింగ్ అధికారులను ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీ పూజ ఆదేశించారు. బుధవారం మండలంలో పలు భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అరమ గ్రామపంచాయతీలో హెల్త్ సెంటర్‌ను, గోళంబో, ఆరమ పంచాయతీలో మల్టీపర్పస్ సెంటర్‌ను, మండల కేంద్రంలో గిరిజన ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ హాస్టల్ స్కూల్ భవనం , కొర్ర గ్రామ పంచాయతీలో అంగన్వాడి సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెల్త్ సెంటర్ భవనానికి ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పెట్టాలని అధికారులను ఆదేశించారు. భవనాల నిర్మాణంలో నాణ్యత పాటించాలని సూచించారు. భవనాల విస్తీర్ణ, అంచనాల వ్యయం అడిగి తెలుసుకున్నారు.

అంగన్వాడీ భవనం లేక ఇబ్బందికి గురవుతున్నారని త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని కొర్రలో గ్రామస్తులు కోరగా, తక్షణ చర్యలకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎఇ అభిషేక్, సిడిపిఒ ఎస్తేరు రాణి పాల్గొన్నారు.

ముల్లుమెట్ట తారురోడ్డు పనులు ప్రారంభం

తారురోడ్డు పనులు ప్రారంభిస్తున్న నేతలు

ప్రజాశక్తి- హుకుంపేట: మండలంలోని తడిగిరి పంచాయతీ పరిధిలోని ముల్లుమెట్ట గ్రామానికి పిఎం జన్‌మన్ నిధులతో తారు రోడ్డు పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పనులను స్థానిక సర్పంచ్ పెనుమల రంజిత్‌కుమార్, వైస్ సర్పంచ్ కిల్లో రామారావు, మండల పరిషత్ వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండల రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండల రావు మాట్లాడుతూ బొడ్డపుట్టు జంక్షన్ నుంచి ముల్లుమెట్ట గ్రామం వరకు సుమారు 3 కిలోమీటర్ల పొడవునా రూ.73 లక్షల వ్యయంతో తారు రోడ్డు నిర్మాణానికి పీఎం జన్‌మన్ నిధులు మంజూరయ్యాయన్నారు. 2018లో మెటల్ రోడ్డు వేసిన తర్వాత దాని నిర్వహణ బాగోగులు పట్టించుకోకపోవడంతో రహదారి అధ్వానంగా మారి గ్రామ ప్రజలు ఎనిమిదేళ్లపాటు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ నేపథ్యంలో సర్పంచ్, వైస్ సర్పంచ్, ఎంపిటిసిలు పట్టుదలలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారని, పనులు ప్రారంభం కావడంతో వాటిని నాణ్యతగా చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వంతాల గాసన్న, పీసా అధ్యక్షుడు భవాని శంకర్, కిల్లో బుజ్జి బాబు, కిల్లో నాగేశ్వరరావు, మహిళలు, యువత పాల్గొన్నారు.

అంగన్వాడీ హెల్పర్ పోస్టుకు దరఖాస్తులు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలకేంద్రంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని తూటంగి పంచాయతీ బుడ్డింగి అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ హెల్పర్ పోస్టుకు దరఖాస్తును ఆహ్వానిస్తున్నామని సిడిపిఒ ఎస్తేరురాణి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రానికి హెల్పర్ పోస్టు భర్తీ చేస్తున్నామన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 35 ఏళ్లలోపు మహిళా అభ్యర్థులు ఈనెల 24 నుంచి వచ్చే నెల 8వ తేదీలోగా ఐసిడిఎస్ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయవచ్చన్నారు. ఆసక్తి గల మహిళ అభ్యర్థులు అర్హత ధ్రువ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గాయపడిన విద్యుత్ కార్మికున్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి అరకులోయ రూరల్: విధి నిర్వహణలో విద్యుత్ స్తంభంపై ఉండగా విద్యుత్‌షాక్‌కు గురై తీవ్రంగా గాయపడిన అరకులోయ సబ్ స్టేషన్‌లో పనిచేస్తున్న మజ్జి అప్పలరాజును ప్రభుత్వపరంగా ఆదుకోవాలని, అవసరమైన మెరుగైన వైద్యసేవలు అందించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు కోరారు. మంగళవారం ప్రమాదానికి గురై అరుకు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అప్పలరాజును, బుధవారం అరకు ఏరియా ఆసుపత్రిలో పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తక్షణం విద్యుత్ శాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అప్పలరాజుకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. అప్పలరాజు మెడ భాగం, ఎడమ చెయ్యి, కాలు తీవ్రమైన గాయాలైన నేపథ్యంలో బాధిత కుటుంబ జీవనోపాధికి, అవసరమైన ఆర్థికసాయం, జీవనభృతి అందజేయాలన్నారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, రూ.కోటి ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అప్పలరాజును పరామర్శించిన వారిలో విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి నిరంజన్ పాల్గొన్నారు.

అప్పలరాజును పరామర్శిస్తున్న సిఐటియు నేతలు

రూ.45 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి- గంగవరం: గంగవరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని 45 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకుని ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు డిఎస్పి జి.సాయిప్రశాంత్ వెల్లడించారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి ఈ కేసుకు సంబంధించిన వివరాలను తెలిపారు. గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు అందుకున్న సమాచారం మేరకు జిల్లా ఎస్పీ ఆదేశాల ప్రకారం సోమవారం గంగవరం శివారు ఎండపల్లి రూట్‌లో నెమలిచెట్టు సెంటర్‌వద్ద రాజవొమ్మంగి సిఐ గౌరీశంకర్ పరిరక్షణలో గంగవరం ఎస్సై బి.వెంకటేష్ సిబ్బంది వాహనతనిఖీలు నిర్వహించారు. ఎండపల్లి వైపు నుండి వస్తున్న ఒక కారు, ఒక మోటార్‌సైకిల్, ఒక మినీ వ్యాన్‌లో గంజాయి పట్టుబడిందన్నారు. 30 ప్లాస్టిక్ సంచుల్లో 920 కిలోల గంజాయి లభ్యమైంది. ఒరిస్సా రాష్ట్రం మల్కన్‌గిరి నుండి ఐదుగురు వ్యక్తులు కంవాడలోని మల్కినగర్‌కు చెందిన పరిష్‌విశ్వాస్, రాయగడకు చెందిన రాబెవేంద్రకార, గుమ్మరేవులకు చెందిన ముర్ల లక్ష్మణరావు, కంవాడకు చెందిన సాకాంతరావు, గోకవరంకు చెందిన నక్క శివ గ్రూపుగా ఏర్పడి గంజాయిని రాజమహేంద్రవరం విజయవాడ ప్రాంతాలకు రవాణా చేస్తున్నారన్నారు. వారు వినియోగించిన వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లు కూడా స్వాధీనం చేసుకున్నామన్నా రు. ఎస్సై వెంకటేష్, ఏఎస్సై సిహెచ్ వివిమహర్షి రాంబాబు, పిసి సాయినాథ్, అశోక్, వీరబాబు, కొండబాబులను డిఎస్పి అభినందిం చారు. సోమవారం గన్నవరం తహశీల్దార్ సిహెచ్ శ్రీనివాసరావు విఆర్ఒ వెంకన్నదొర సమక్షంలో గంజాయిని తూకం వేసి వెలకట్టినట్టు డిఎస్‌పి వివరించారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి సాయిప్రశాంత్

హత్య కేసులో నిందితుని అరెస్టు

ప్రజాశక్తి -సీలేరు: భగత్‌రామ్ హత్య కేసులో నిందితుడు వినోద్ అలియాస్ బబులను బుధవారం అరెస్ట్ చేసి విశాఖ పట్నం (జువైనల్ హోం) కు తరలించామని జికె వీధి సిఐ వరప్రసాద్ తెలిపారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని సీలేరు పంచాయతీ పరిధి చింతపల్లి క్యాంపునకు చెందిన వినోద్ అలియాస్ బబుల ఈనెల 21 ఆదివారం రాత్రి 11.30 కు భగత్‌రామ్‌ను హతమార్చి పరారయ్యాడన్నారు. అనంతరం తమ సిబ్బందిని రెండు టీములుగా ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టి నిందితుని అదుపులోకి తీసుకున్నామన్నారు. పథకం ప్రకారమే ఈ హత్యకు పాల్పడినట్టు తమ విచారణలో వెల్లడైందన్నారు. నిందితుడు మైనర్ కావడంతో విశాఖపట్నం జువైనల్ హోంకు తరలించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐ వరప్రసాద్

పారదర్శకంగా విచారణ జరపాలి

ప్రజాశక్తి - కూనవరం: కూనవరం పంచాయతీలో అవినీతిపై పారదర్శకంగా విచారణ చేసి సర్పంచ్, ఇఒపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిఎల్‌పిఒకి అంబేద్కర్ యువజన సంఘం నాయకులు కొక్కెరపాటి రవీంద్ర, ములకపల్లి కిషోర్ బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుర్వినియోగానికి సంబంధించి రికార్డు అంతా తనిఖీ చేయడానికి వచ్చిన అధికారులకి పక్క ఆధారాలు అందించామన్నారు. సమర్పించిన రికార్డు ఆధారంగా పంచాయతీలో రికార్డును తనిఖీ చేసి అవినీతి జరిగిందని రుజువైతే ఆ మొత్తం ధనాన్ని పూర్తిగా రికవరీ కట్టిస్తామని, అవినీతి జరిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చార న్నారు. అంబేద్కర్ యువజన సంఘం మండల కార్యదర్శి కొవ్వల రాజా, కోవాలి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న రవీంద్ర ,కిషోర్

'విద్యార్థులు సేవాగుణాన్ని అలవర్చుకోవాలి'

ప్రజాశక్తి-చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయసేవా విభాగం ఆధ్వర్యంలో బుధవారం జాతీయసేవా పథకం (ఎన్ఎస్ ఎస్) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం తెలియజేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాగుణం కలిగి ఉండాలని, మానవసేవే మాధవసేవ అని, సమాజ సేవా కూడా చదువులో భాగమేనన్నారు. యువత చెడు వ్యసనాలకు లోనుకాకుండా ఉత్తమ పౌరులుగా తయారు కావాలన్నారు. వైస్ ప్రిన్సిపల్ శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజసేవ చేయడం ద్వారా వ్యక్తిత్వ వికాసాభివృద్ధి సాధిస్తారన్నారు. కళాశాల సీనియర్ అధ్యాపకులు వెంకటరావు, వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి హారతి ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జి.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

మొక్కలు నాటుతున్న విద్యార్థులు

మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	9490099125	పూర్ణమార్కెట్	9490099676
మధురవాడ	8008596645	జగదాంబ	9490099434
గాజువాక	9849392359	జివియంసి	9490099483
అనకాపల్లి	8008736188	ద్వారకానగర్	9490099672
చోడవరం	9490099141	కంచరపాలెం	9490099135
నర్సీపట్నం	9440280411	మాదవధార	9490099675
పాడేరు	9490099142		
రంపచోడవరం	9440165617		

ప్రతిజ్ఞ చేయిస్తున్న నాగార్జున

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

ప్రజాశక్తి-చింతపల్లి : మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అల్లూరి సీతారామరాజు జిల్లా ఈగల్ ఇన్‌స్పెక్టర్ డి.నాగార్జున హితవుపలికారు. చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం, రవాణా, మాదకద్రవ్యాల వల్ల సమాజం నాశనమవుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని, చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఆరోగ్యకరమైన మార్గంలో నడవాలని సూచించారు. యువత దేశ భవిష్యత్తు కాబట్టి, సమాజాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దే బాధ్యత మనందరిదని పేర్కొన్నారు. స్వార్థరహిత సేవే ఎన్ఎస్ఎస్ ప్రధాన లక్ష్యమని గుర్తు చేస్తూ, వాలంటీర్లు దేశ సేవలో సదా సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి ఎస్సై వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఈగల్ టీమ్ పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడే శిరగంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండలంలోని శిరగం పంచాయతీ కేంద్రంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మాడగడ పిహెచ్‌సి, శిరగం పంచాయతీ హెల్త్ అసిస్టెంట్ చట్టు చిన్న తెలిపారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా నిర్వహించే ఉచిత మెడికల్ క్యాంపులో జ్వరం, నొప్పి,గుండె, శ్వాసకోశ, క్యాన్సర్, షుగర్, బిపి ఇతర అనేక వ్యాధి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహింపబడతాయని స్పష్టం చేశారు.ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ శిబిరాల్లో మహిళల ఆరోగ్య సమస్యలకు ప్రత్యేకంగా స్క్రీనింగ్, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, కౌన్సెలింగ్, వైద్యసేవలు అందిస్తారన్నారు.

అడవి నుంచి ఆదివాసీలను గెంటేసే కుట్రను..

ఐక్యంగా తిప్పికొట్టాలి

- సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలనర్స
- గిరిజన గ్రామాల్లో ఆదివాసీ అరణ్య గర్జన జీపుజాతా

దుంబ్రిగుడలో మాట్లాడుతున్న అప్పలనర్స

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుతో ఆదివాసీలను అడవులను నుంచి గెంటివేయాలన్న కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల కుట్రను మన్యవాసులు ఐక్యంగా తిప్పికొట్టాలని సిపిఎం అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి పి అప్పలనర్స పిలుపునిచ్చారు. ఏజెన్సీ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్లాంట్ ప్రాజెక్ట్ నిర్మాణాలకు వ్యతిరేకంగా ఆదివాసీ గిరిజన సంఘం, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ చేపట్టిన ఆదివాసీ అరణ్య గర్జన జీపుజాతా బుధవారం మండలంలో చేరుకుంది. ఈ సందర్భంగా జాకరవలస సభలో అప్పలనర్సమాట్లాడుతూ ఏజెన్సీలో సహజ నీటి వనరులను దోపిడీ చేసుకోవడానికి కార్పొరేట్ ప్రైవేట్ కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుందన్నారు. గ్రామసభలు, పీసా కమిటీలు, 1/70, ఇతర గిరిజన చట్టాలను ఉల్లంఘిస్తూ, రాజ్యాంగ విరుద్ధంగా చేసుకున్న ఈ ఒప్పందాలను రద్దు చేయాలని ఆదివాసీలు తీవ్రస్థాయిలో ఆందోళన చేస్తున్నా ప్రభుత్వాలకు కనీసం చీమ కుట్టినట్టు కూడా లేకపోవడం శోచనీయమని విమర్శించారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన విద్యుత్ ఉత్పత్తి యూనిట్ల సామర్థ్యాన్ని పెంచుతూ చిట్టంవలస, పెదకోట, గుజ్జెలిలో హైడ్రో పవర్ ప్లాంట్ ప్రాజెక్టులకు ప్రస్తుత ప్రభుత్వం జిఒ 13, 51 జారీ చేసి ఆదివాసులను రెచ్చగొట్టే చర్యకు పూనుకుందన్నారు. , ప్రశాంతమైన గిరిజన ప్రాంతంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలు ప్రభుత్వాలే చేపట్టడం దుర్మార్గమన్నారు. మన్యంలో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణంతో 30వేల ఎకరాలు అటవీ, వ్యవసాయ భూములు ప్రయివేటుకు ధారాదత్తమౌతాయని, ప్రభుత్వం అనుమతించిన ఐదు ప్రాజెక్టుల్లో సుమారు 50 వేల మంది జల సమాధి కాబోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రో పవర్ ప్లాంట్ ప్రాజెక్ట్ నిర్మాణంపై అపోహలు, ఆందోళనలు వద్దని ప్రభుత్వం, నేతల ప్రకటనలు ఆందోళనలు రెచ్చగొట్టేవిగా భావించాల్సి వస్తోందన్నారు. ఉద్యమాన్ని అణచి వేసేందుకు గిరిజన గ్రామాల్లో పోలీస్ ప్రికెటింగ్ లు ఏర్పాటు చేసి ప్రభుత్వం నిర్బంధించడం భావ ప్రకటనా స్వేచ్ఛకు వ్యతిరేకమని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యుడు కె.త్రినాథ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్‌బి పోతురాజు, మండల నాయకులు పి సురేష్ కుమార్, పి సత్యనారాయణ, టి సూర్యనారాయణ, గిరిజనలు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని అడ్డుమండ పంచాయతీ సన్యాసిపాలెం నుంచి ప్రారంభమైన ఆదివాసీ అరణ్య గర్జన జీపు యాత్ర బుధవారం హుకుంపేట చేరింది. ఈ సందర్భంగా జీపు యాత్ర రథసారధి, సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పల నర్స మాట్లాడుతూ హైడ్రో పవర్ ప్రాజెక్టుల పేరుతో ఏజెన్సీలో అడవులను, సహజ వనరులను కార్పొరేట్లకు అప్పగిస్తూ, కుదుర్చుకున్న ఒప్పందాల జిఒ 51 వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అడవుల నుంచి ఆదివాసీలను గెంటివేసే కుట్రలను మానుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.ఎ. భావతి, జీపు జాత సారధులు కె. త్రినాథ్, కృష్ణారావు, వరహాలు, దాసు, మండల నాయకులు అప్పలకొండ పడాల్, అప్పారావు, మహిళలు, యువత పాల్గొన్నారు.

హుకుంపేటలో నిర్వహిస్తున్న అరణ్య గర్జన జీపుజాతా

ఇవిఎం గోదాముల తనిఖీ

ప్రజాశక్తి- పాడేరు : అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇవిఎం గోదామును బుధవారం జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్‌కుమార్ తనిఖీ చేశారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి, గోదాములను సందర్శించి అక్కడి పరిస్థితిని గమనించారు. నేతల సమక్షంలో గోదాముల వద్ద వేసిన సీళ్లను ఇవిఎం రక్షణ, భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. గోదాముల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులకు పలు సూచనలు, మార్గదర్శకాలు జారీ చేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మలత, పాడేరు తహశీల్దార్ అరుణ్ చంద్ర, ఉప తహశీల్దార్ సోమేశ్వరరావు, లక్ష్మణమూర్తి, మత్స్యరాజు పాల్గొన్నారు.

వికలాంగ పింఛను పునరుద్ధరణకు వినతి

ప్రజాశక్తి- దుంబ్రిగుడ: వికలాంగ పింఛను నిలిపేయడంతో ఇబ్బందులు పడుతున్నానని మండలంలోని పోతంగి పంచాయతీ కేంద్రానికి చెందిన గొల్లోరి సత్తో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎడమ చేయి సగ భాగం లేకపోవడంతో సదరం సర్టిఫికెట్ పొంది గతంలో వికలాంగ పింఛను వచ్చేది అంటున్నారు. ఆ డబ్బులతో జీవనోపాధి పొందుతున్న తనకు ఇటీవల అకస్మాత్తుగా అధికారులు పింఛను నిలిపి వేయడంతో బతుకుకు ఇబ్బంది పడుతున్నానని వాపోయారు. తక్షణమే అధికారులు స్పందించి తన వికలాంగ పింఛను పునరుద్ధరించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

పిఒకు మొక్కను బహూకరిస్తున్న నేతలు

సమస్యలపై పిఒకు ఆదివాసీల వినతి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అల్లూరి జిల్లా, పాడేరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి తిరుమణి శ్రీ పూజ ను ఆదివాసీ పరిరక్షణ సమితి అధ్యక్షుడు చట్టు మోహన్, నాయకులు సమర్డి సురేష్, సోమెల స్వామి బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు అందించారు.ఈ సందర్భంగా చట్టు మోహన్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో గిరిజన హక్కులు, చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని కోరారు. గిరిజన గ్రామాలకు తాగునీరు, రోడ్డు ఇతర సౌకర్యాలను కల్పించాలని, విద్యార్థులకు సరైన వసతి గృహాలు నిర్మించాలని కోరారు.

సచ్చిదానందమూర్తి రచనలతో చైతన్యం

- ఒడిశా గవర్నర్ కె.హరిబాబు

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఆచార్య సచ్చిదానందమూర్తి రచనలు, పరిశోధనలు నిరంతరం మనల్ని చైతన్యవంతం చేస్తూ ఉంటాయని ఒడిశా రాష్ట్ర గవర్నర్ కె.హరిబాబు చెప్పారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అసెంబ్లీ మందిరంలో ఏయూ తత్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఐసిపిఆర్ అంతర్జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. 'ఎక్స్‌ప్లోరింగ్ ద ఫిలసాఫికల్ లెగసి ఆఫ్ ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తి' అనే అంశంపై మూడు రోజుల సదస్సును నిర్వహిస్తున్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన ఆచార్య కె.సచ్చిదానంద మూర్తి విగ్రహానికి ముందుగా కంభంపాటి హరిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సచ్చిదానందమూర్తి తన జీవితాన్ని బోధన, పరిశోధనకు అంకితం చేసిన విధానాన్ని వివరించారు. తత్వశాస్త్రం అనేది నైతిక విలువలు, విద్య, సమాజం, శాంతికి అనుసంధానమై ఉంటుందని చెప్పారు. సచ్చిదానందమూర్తి భారతీయ తత్వ శాస్త్రాన్ని అధ్యయనం చేయడంతో పాటు పాశ్చాత్య దృక్పథాలను సైతం స్వీకరించే వారని తెలిపారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా, యుజిసి వైస్ చైర్మన్‌గా ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకోవాలన్నారు.

గంజాయి వినియోగం సమాజానికి చేటు

జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు : గంజాయి వినియోగం సమాజానికి చేటని,దీని ఉత్పత్తి, వినియోగం నిర్మూలన బాధ్యత అందరిపై ఉందని,జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్ స్పష్టం చేసారు. బుధవారం కలెక్టరెట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఈగల్, పోలీస్, వ్యవసాయశాఖ, అటవీశాఖ, ఉద్యాన, వైద్య ఆరోగ్య, విద్యా, ఐసిడిఎస్, ఎక్సైజ్, అటవీశాఖ, డిఆర్డిఎ, సిపిఓ, డ్వామా, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులతో గంజాయి నిర్మూలన, ప్రత్యామ్నాయ పంటలపై సమీక్షా సమావేశం నిర్వహంచారు. గత సమావేశంలో తీసుకున్న యాక్షన్ ప్లాన్ అంశాల అమలుపై ఆరాతీశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి ఉత్పత్తి, వినియోగం నివారించడమే లక్ష్యమన్నారు. ప్రతి నెలా నిర్వహించిన సమావేశాలకు సంబంధిత శాఖల అధికారులు పూర్తి డేటాతో హాజరు కావాలని ఆదేశించారు. పోలీస్ నిఘాతో పాటు ప్రతి చెక్ పోస్ట్ దగ్గర గంజాయి రవాణా నియంత్రణపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకోవాలన్నారు. పట్టబడిన గంజాయిపై కేసులు నమోదు చేయాలన్నారు. గంజాయి అనర్థాలపై విద్యార్థులకు అవగాహనా కల్పించాలన్నారు. అన్ని శాఖలు ప్రణాళికాయుతంగా, సమన్వయంతో పనిచేసి, గంజాయి నిర్మూలన బాధ్యత చేపట్టాలన్నారు.కళాశాలలు, ఉన్నత పాఠశాలలో గంజాయి వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహనా సదస్సులు నిర్వహించాలన్నారు.. గంజాయి సాగును దూరం చేసుకున్న గిరిజన రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, స్వయం ఉపాధి పథకాలు, బ్యాంకు రుణాలు, పశువులు, మేకల యూనిట్లనును మంజూరు చేయాలని స్పష్టం చేసారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెలలో ఎన్ని వినతులు వచ్చాయి, వాటిపై ఏం చర్యలు తీసుకున్నారో అడిగి తెలుసుకుని తగు సూచనలు చేశారు

జిల్లా ఎస్‌పి అమిత్ బర్ధార్ మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా, వినియోగం ఏ రూపంలో కలిగి ఉన్నా వారిపై చట్టపరమైన కేసులు నమోదుతోపాటు, వారి స్థిర, చరాస్తులను జప్తు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. గిరిజన గ్రామాల్లో గంజాయి స్మగ్లర్లకు ఆశ్రయం కల్పించడం నేరమన్నారు. బస్‌స్టాండ్లలో పటిష్టమైన నిఘా పెట్టామన్నారు. ప్రజలతో సంబంధాలు ఉన్న శాఖల అధికారులు గంజాయి పండించ కూడదనే స్థానిక ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పిపిటి ద్వారా గంజాయి ఉత్పత్తి, నివారణకు చేపట్టవలసిన పనులను శాఖలవారీగా రెవిన్యూ, పంచాయతీ రాజ్, అటవీ, వ్యవసాయ, ఉద్యాన, రవాణా విద్యా, యూత్ వెల్ఫర్,వైద్య ఆరోగ్య, ట్రైబల్ వెల్ఫర్ అధికారులు వివరించారు.

సమావేశంలో పాడేరు, రంపచోడవరం, చింత్తూరు ఐటిడిఎ పిఒలు తిరుమణి శ్రీపూజ, స్మరణ్ రాజ్, అపూర్వ భరద్వాజ్. సబ్ కలెక్టర్లు, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి ఝాన్సీ రామ్ పడాల్, డిఎంహెచ్ఒ విశ్వేశ్వర నాయుడు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బిఎస్ నందా, డిఆర్‌డిఎ పిడి వి.మురళీ, సిపిఒ పి.ప్రసాద్, ఎల్‌డిఎం మాతునాయుడు, జిల్లా ఉద్యాన శాఖా అధికారి కె. బాలకర్ణ, వర్చువల్‌గా డిఎఫ్ఒ పివి.సందీప్ రెడ్డి పాల్గొన్నారు.

తాత్కాలిక ఆది కర్మయోగి సేవా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-రంపచోడవరం : ముసురుమిల్లి పంచాయతి బోర్నగూడెం, ముసురుమిల్లి అంగన్వాడీ కేంద్రాల్లో తాత్కాలిక ఆది కర్మయోగిసేవా కేంద్రాన్ని సర్పంచ్ కోసు రమేష్‌బాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భగా ఆయనతో పాటు ఎంపిటిసి వంశి కుంజం మాట్లాడుతూ ఈ సేవా కేంద్రం ద్వారా పలు రకాల సేవలు అందిస్తారని గ్రామస్తులందరూ ఈ సేవలను ఉపయో గించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వార్డ్‌మెంబర్లు సరస్వతి, మాజీ సర్పంచ్ గుర్రేటి లక్ష్మి, పంచాయతి కార్యదర్శి రాంబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'సచివాలయ ఉద్యోగులపై అదనపు భారం తగదు'

ప్రజాశక్తి-విఆర్‌పురం: సచివాలయ ఉద్యోగులకు అదనపు బాధ్యతలు అప్పగించడం తగదని చింతరేగుపల్లి సర్పంచ్ పిట్ట రామారావు, కోటం జయరాజు అన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. సచివాలయం దగ్గర ఇన్‌చార్జిని పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, రెండు పంచాయతీలకు ఒక్కరినే నియమించడం వల్ల పనిభారం ఎక్కువైందని ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రతి పంచాయతీలో అవసరం మేరకు ఉద్యోగులను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రేపు జాబ్ మేళా

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 26న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయభారతి తెలిపారు. డీడీయూ-జికేవై సమక్షంలో, భారత ప్రభుత్వ ఎస్ఇఇడి ఎపి, గ్రామీణ అభివృద్ధి సంస్థ, మిలీనియం సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా జరుగనుంది. జాబ్‌మేళాలో ఎంపికైన వారికి ఉచిత వసతి, శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులతో పాటు టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇతర చదువుల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు తమ ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

కుర్చీలు అందిస్తున్న టిడిపి మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రావు

తహశీల్దార్ కార్యాలయానికి కుర్చీల వితరణ

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి తహశీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి కుర్చీల కొరత కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో టిడిపి మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రావు 20 ప్లాస్టిక్ కుర్చీలను కొనుగోలు బుధవారం తహశీల్దారు ఆనంద్‌కు అందజేశారు. కార్యక్రమంలో కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ గెమ్మెలి అబ్బాయినాయుడు, టిడిపి నాయకులు రీమల ఆనందరావు, లక్కోజు నాగభూషణం, కె.మధు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

కాలువపై సిమెంట్ పలకలు వేయరూ..!

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి రేషన్ డిపో వద్ద డ్రెయినేజీపై పలకలు లేకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ డిపోకు రావాలంటే డ్రెయినేజీ దాటాల్సి ఉంది. అయితే కాలువపై సిమెంట్ పలకలు ఏర్పాటు చేయకపోవడంతో వృద్ధులు, గర్భిణులు, చిన్నపిల్లలు ఇబ్బంది పడుతున్నారు. కాలువలో జారిపడిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సిమెంట్ పలకలు వేయాలని, లేకుంటే రేషన్‌డిపోను వేరే చోటికి మార్చాలని వారు కోరుతున్నారు. అధికారులు స్పందించకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

పలకలు లేని కాలువ

స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్‌లో..

పలువురికి వైద్య పరీక్షలు

విఆర్‌పురం: పరీక్షలు చేస్తున్న వైద్యులు

దుంబ్రిగుడ: కురిడి సబ్‌సెంటర్‌లో పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-విఆర్‌పురం: మండలంలోని పెద్దమట్టపల్లి పంచాయతీ పెద్దమట్టపల్లి హెల్త్ వెల్‌నెస్‌సెంటర్‌లో డాక్టర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ వెట్టి లక్ష్మి సమక్షంలో స్వస్థనారీస్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆయుర్వేద డాక్టర్ స్వర్ణలత స్క్రీనింగ్ పరీక్ష గురించి వివరించారు. స్క్రీనింగ్ పరీక్షలు చేసి మందులు అందించారు. పిహెచ్‌ఎన్ భద్రకాళి హెచ్‌వి సీత, ఎంఎల్‌హెచ్‌పి పోశమ్మ తదితరులు పాల్గొన్నారు.

చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహిళా సాధికారత విభాగం జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో, స్థానిక ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సహకారంతో విద్యార్థులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం తెలిపారు. కార్యక్రమంలో చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సిబ్బంది, డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్‌లో స్థానిక పిహెచ్‌సి కురిడి సబ్ సెంటర్‌లో బుధవారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్య అధికారులు నజీబ్, కుమార్‌రత్న వ్యాధిగ్రస్తులకు వైద్యం పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగావ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించి, తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ.పాటించాలన్నారు. గ్రామాల్లో ఎవరికైనా అనారోగ్యం చేస్తే తమకు సమాచారమిస్తే వైద్యసిబ్బందిని పంపి తగు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ సంజీవ్, పద్మ, హెల్త్ అసిస్టెంట్ ఎస్ ప్రభాకర్, ఎంపిహెచ్ఒ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చింతూరు : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వైద్యపరీక్షలు

రంపచోడవరంలో ఆధార్ మెగామేళా

ప్రజాశక్తి- రంపచోడవరం : రంపచోడవరం డివిజన్‌లోని ప్రజలు ఆధార్‌మెగామేళాను చాలామంది ప్రజలు సద్వినియోగం చేసుకున్నారని రంపచోడవరం ఐటిడిఎ ఎపిఒ జనరల్ డిఎన్వి రమణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఆధార్‌లో తప్పులు, మార్పులు, చేర్పులకు సంబంధించి ఆధార్ మెగా మేళా కార్యక్రమాన్ని ఎపిఒ జనరల్ డిఎన్‌వి రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటిడిఎ ఎపిఒ జనరల్ డిఎన్వి రమణ మాట్లాడుతూ పిఒ స్మరణ్‌రాజ్ ఆదేశాల మేరకు ఆధార్‌కార్డుల్లో మార్పులు, చేర్పులు, తప్పులు సరిచేసుకునేందుకు ఈ మెగామేళాను ఏర్పాటు చేశామన్నారు. 5 ఆధార్‌కిట్లతో సుమారు 20 మంది సిబ్బందితో కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఎప్పటికప్పుడు ఆధార్‌కార్డులు మార్పులు చేర్పులు చేశారన్నారు. అదేవిధంగా యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం ఆధార్‌కార్డులో పేరు, తల్లిదండ్రుల పేరు, భార్య, భర్త పేరు, జనన తేదీ, లింగం వంటి డెమోగ్రాఫిక్ వివరాలు గరిష్టంగా రెండుసార్లు మాత్రమే సవరించుకోవచ్చును. అయితే కార్డుదారులు ఈ లిమిట్‌ను ప్రత్యేక ఆధార్ గ్రీవెన్స్ శిబిరం ద్వారా సరిచేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆధార్‌కార్డ్ కోఆర్డినేటర్ డేవిడ్, పిఎంయు అధికారులు చంద్రకళ, మోహన్, సంధ్య, ఎస్ఐ షరీఫ్, డిప్యూటీ ఎంపిడిఒ రాజబాబు, తహశీల్దార్ సిహెచ్ నిర్మల, విఆర్‌ఒలు శివకుమార్, చిన్నిరాజు, పంచాయతీ కార్యదర్శి కామరాజు పాల్గొన్నారు.

మేళా ప్రారంభిస్తున్న ఐటిడిఎ ఎపిఒ జనరల్ డిఎన్వి రమణ

ఇమ్మడి సిల్వర్ జ్యూయలరీ షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆర్టిసి కాంప్లెక్స్ సమీపం సంపత్ వినాయఘర్ రోడ్డులో కొత్తగా ఏర్పాటు చేసిన ఇమ్మడి సిల్వర్ జ్యూయలరీ షోరూంను సంస్థ సిఇఒ ఇమ్మడి సునీత, చైర్మన్ ఇమ్మడి రమేష్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ ఇమ్మడి సిల్వర్ జ్యువలరీ, విశాఖపట్నంలో తన 14వ షోరూంని ప్రారంభించిందన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా బంపర్‌ఆఫర్లను అందిస్తోందని లక్ష రూపాయల కొనుగోళ్లపై రూ.50 వేల విలువగల సెలెక్టెడ్ సిల్వర్ జ్యువలరీ, రూ.50 వేల విలువగల సిల్వర్ జ్యువలరీ కొనుగోళ్లపై రూ. 25 వేల విలువ గల సెలెక్టెడ్ సిల్వర్ జ్యువలరీ అలాగే రూ.25వేల కొనుగోళ్లపై రూ.12,500 విలువ గల పెర్ల్ నక్షిమాల రూ.10 వేల విలువగల సిల్వర్ జ్యువలరీ కొనుగోళ్లపై రూ. 5 వేల విలువ గల పెర్ల్‌మాల ఉచితమన్నారు.

ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న శానిటేషన్ కార్మికులు

శానిటేషన్ కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి ఆసుపత్రి శానిటేషన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. అక్టోబర్ 15లోపు సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్మికులకు కొత్త వేతన జిఒ అమలు చేయాలని, ఎరియర్స్ చెల్లించాలని, ఇపిఎఫ్, ఈఎస్ఐ సవరణలు చేయాలని, జీతాలు సకాలంలో ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, సేఫ్టీ పరికరాలు ఇవ్వాలని, రెస్ట్‌రూమ్స్ సౌకర్యం కల్పించాలని, సూపర్‌వైజర్ పోస్టులు భర్తీ చేయాలని, షిఫ్ట్ విధులు అమలు చేయాలని కోరారు. పెస్ట్ కంట్రోల్, ఎస్ఎంసి, ఎన్ఆర్‌సి, కేంటీన్, బర్త్ వెయిటింగ్ విభాగాల్లో సిబ్బందిని నియమించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్యపడాల్, కార్మికులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన వాహనాలు

చింతపల్లిలో ట్రాఫిక్ కష్టాలు

ప్రజాశక్తి-చింతపల్లి : మండల కేంద్రం చింతపల్లిలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకీ తీవ్రరూపం దాల్చుతోంది. ప్రధాన రహదారికి ఇరువైపులా విచ్చలవిడిగా పార్కింగ్ చేయడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోతున్నాయి. ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాలు రాకపోకలకు ఎక్కువ సమయం పడుతోంది. ప్రతి బుధవారం వారపు సంతకు పరిసర గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చే క్రమంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. ముఖ్యంగా ఏరియా ఆసుపత్రికి రోగులను తరలించే అంబులెన్సులు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతోంది. అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

వచ్చే నెల 25, 26 తేదీల్లో రాష్ట్ర స్థాయి యోగా పోటీలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: రాష్ట్రస్థాయి యోగా పోటీలను వచ్చేనెల 25,26 తేదీల్లో విశాఖపట్నం వెంకోజీపాలెం సిఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్టు జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులు కె.ఎ.రాజు తెలిపారు. బుధవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి సుమారు 500 మంది దీనిలో పాల్గొంటారన్నారు. 8 గ్రూపులుగా విభజించి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు డిసెంబర్ 27,28,29వ తేదీల్లో బాపట్లలో నిర్వహించే 44వ జాతీయ స్థాయి పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. పోటీల్లో పాల్గొనదల్చిన అభ్యర్థులకు అక్టోబర్ 24న సిఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి కలిగినవారు 9948215863, 9866077307, 9333333344 నెంబర్లను సంప్రదించవచ్చు అన్నారు. సమావేశంలో చీఫ్ అడ్వైజర్ జి.ఆదినారాయణ, శ్రీలక్ష్మి, సిహెచ్. వెంకటరమేష్ పాల్గొన్నారు.